# 7

# భారత రసాయన శాస్త్రం

ఆ శనిగ్రహాన్ని రమ్మనకుండా ఉన్నా పోయేది అనుకుంది లత విసుగ్గా. ఆ శనిగ్రహం పేరు భారతి. లతకి బాల్య స్నేహితురాలు. చిన్ననాటి స్నేహాలు పెద్దయ్యేసరికి గాల్లో కలిసిపోతాయి. కానీ భారతి, లత మాత్రం ఆ స్నేహాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఏ రెండు మూడేళ్ళకో ఒకసారి కలుసుకుంటూనే ఉంటారు. భారతి బంధువుల ఇంట్లో పెళ్ళని హైదరాబాద్ వచ్చింది. ఎలాగు వస్తున్నావు నా దగ్గర రెండు రోజులుండి వెళ్ళు అంది లత. అలాగే వస్తాను... అని చెప్పింది భారతి.

ఆ రెండు రోజులూ కబుర్లే కబుర్లు. "నీ పెళ్ళై ఎన్నాళ్ళయిందే?" అడిగింది భారతి.

"ఏవిటింత అయోమయం? మనిద్దరి పెళ్ళిళ్ళు ఒకేసారి కదా అయ్యాయి. అవలా పధ్నాలుగేళ్ళు" అంది లత.

"మీ ఆయన విసుక్కుంటున్నాడా?"

"అదిప్పుడు కొత్తా! ఎప్పుడు ఉండేదేగా. నేనూ పట్టించుకోవడం మానేసాను. అయినా ఎక్కువసేపు ఇంట్లో ఉండరుగా. తెల్లవారగానే టి.వి, పేపరు చదవటం. ఆఫీసు నుంచి వచ్చాక కాఫీ తాగి మళ్ళీ ఊరిమీద బలాదూరు తిరిగి అందరికీ ఉచిత సలహాలు ఇచ్చి ఏ ఎనిమిదింటికో తిరిగొస్తారు. భోజనం, మళ్ళీ టి.వి. ఆయనకి కాలక్షేపం అయిపోతుంది. ఆ శాల్తీ ఇంట్లో ఉండడం కంటే బయటెక్కడో ఉంటే నా ప్రాణానికి సుఖం" అంది కారప్పూస తింటూ.

"ఏడిసినట్లే ఉంది నీ వరస. నా మొగుడు ఎప్పుడు ఇంట్లో ఉండడు అని సరదాపడుతూ ఉండు. ఏదోనాడు నీ కొంప కొల్లేరవుతుంది. అప్పుడు ఏడుద్దువుగాని" కోప్పడింది భారతి.

"అదేమిటీ?" కంగారు పడింది లత.

"ఏవిటేవిటే నీ తలకాయ! బయట ప్రపంచం ఎలా ఉందో చూస్తున్నావా? వివాహేతర సంబంధాలు సర్వసాధారణం అయిపోతున్నాయి. మీ ఆయన ఈ వయసులో కూడా చక్కగా హిందీ సినిమా హీరోలా ఉంటాడు. మంచి ఉద్యోగం, ఆస్తి అన్నీ ఉన్నాయి. నువ్వేమో అతన్నలా వదిలేసి నిశ్చితంగా కూర్చున్నావు. రేపు ఏదైనా జరిగితే జన్మంతా ఏడవాలి. కాబట్టి అతని మీద ఓ కన్నేసి ఉంచు. నీ మీద విసుగు, చిరాకు ఎక్కువైతే అవతల ఏదో వ్యవహారం నడుస్తోందనే అర్థం" అని బ్రెయిన్ వాష్ చేసింది.

భారతి హితబోధ లత మీద బాగా పని చేసింది. మర్నాటినించే భర్తమీద ఓ కన్నేసి ఉంచింది.

అతను ఫోన్‌లో మాట్లాడుతుంటే పనొదిలేసి వచ్చి వినడం, బయటికెళ్తుంటే ఎక్కడికి వెళ్తున్నారు అని అడగడం, రాగానే ఎక్కడ్నించీ వస్తున్నారు అని ఆరా తియ్యడం.

రెండ్రోజులు చూసి కిరణ్ చిరాకుపడ్డాడు. "ఏవిటా ఆరాలు? ఇంట్లో ఉన్నంతసేపూ పోలీసు కుక్కలాగా నా వంక అనుమానంగా చూస్తున్నావేం" అని విసుక్కున్నాడు.

దాంతో మరింత పాడైంది లత మనసు. ఆ వేళ వారపత్రిక తిరగేస్తుంటే ఒక ఆర్టికల్ కనిపించింది. మీ సంసారం సజావుగా సాగుతుందా మీరే నిర్ణయించుకోండి... అని ఓ పరీక్ష పెట్టారు. ప్రశ్నలు ఇచ్చి ఒక్కో ప్రశ్నకీ కింది నాలుగేసి సమాధానాలు ఎ. బి. సి. డి. అని వేసారు.

తన సంసారం గురించి మనస్తాపం చెందుతున్న సమయంలో అటువంటి ప్రశ్నాపత్రం దొరకడంతో ప్రాణం లేచి వచ్చింది లతకి. వెంటనే ఆ ప్రశ్నలకు జవాబులు రాసింది. సమాధానాలు ఆఖరు పేజీలో ఇచ్చారు. ఏ అయితే ఇన్ని, బి అయితే ఇన్ని, అని మార్కులు కేటాయించారు.

మీకు ఎనభై మార్కులొస్తే, మీది ఆదర్శ దాంపత్యం. ఈ జన్మకే కాదు పై జన్మకీ కూడా మీరే భార్యాభర్తలు. అరవై వస్తే మీ సంసారం ఢోకా లేదు. నలభై వస్తే మీరు కాస్త జాగ్రత్తగా వహించాలి. ఇరవై మార్కులొస్తే మాత్రం మీ సంసారం ఓటి పడవలో ఏటి ప్రయాణం. ఏ క్షణాన అయినా మునిగి పోతుంది అని రాసారు.

లతకి పన్నెండు మార్కులు వచ్చాయి.

గుండె తారుమంది. మరోసారి ప్రయత్నించి చూసింది.

ఆత్మవంచన చేసుకుంటే తప్ప మరో అరమార్కు కూడా ఎక్కువ వచ్చే దారి కనిపించలేదు. చెప్పలేనంత దిగులేసింది లతకి.

మరో వారం రోజులు తిరిగొచ్చాయి. కొత్త వీక్లీ వచ్చింది. అందులో పండంటి కాపురానికి పదహారు సూత్రాలు అని ఆర్టికల్ ఉంది. పాపం ఈ పత్రిక వాళ్ళు మంచి వాళ్ళు. కిందటి వారం పరీక్షపెట్టి ఫెయిలైన వాళ్ళను అనాథల్లా వదిలెయ్యకుండా ఇలా దారి చూపించారు అనుకుంది లత. ఆ ఆర్టికల్ చాలా శ్రద్ధగా చదివింది, నీరసం వచ్చింది చదివాక. వాళ్ళు పాపం పదహారు సూత్రాలు చెప్పారు గానీ తనకు పనికొచ్చేది ఒక్కటీ కనిపించలేదు.

"పొద్దున వెళ్ళి సాయంత్రం ఆఫీసునించి వచ్చే భర్తతో మధ్యలో ఒకటి రెండు ఫోన్స్ చేసి రొమాంటిక్‌గా మాట్లాడండి..." అని రాసారు. అదే మొదటి సూత్రం.

కిరణ్ అదో రకం మనిషి. పెళ్ళైన కొత్తల్లో ఓ సారి ఆఫీసుకి ఫోన్ చేసింది. "ఏవండీ! మా నాన్నగారు" అంటూండగానే అందేసుకుని-

"పోయారా! నేననుకుంటూనే ఉన్నా. మొన్న పండక్కి వెళ్ళినప్పుడే ఈసురోమని తిరుగుతుంటే ఇక లాభం లేదు. ఎక్కువ రోజులు బండి లాగరు అనుకున్నా. భయపడినట్లే అయింది పాపం. పోనీలే ఆయనకేం పుణ్యాత్ముడు. బాధ్యతలన్నీ తీరిపోయాయి. నీ పెళ్ళీ పేరంటం చేసేసారు" అని మాట్లాడుతుంటే అతి కష్టం మీద ఆపి "అయ్యో పోలేదండీ. మా అనంతం మావయ్యకిచ్చి ఆవకాయ పంపిస్తున్నారట. మిమ్మల్ని స్టేషన్‌కి వెళ్ళి తెచ్చుకోమన్నారు" అని చెప్పేసరికి నీరసం వచ్చింది.

అలాంటి మనిషితో రొమాంటిక్‌గా మాట్లాడ్డం ఒకటే తక్కువ.

మిగిలిన సూత్రాలన్నీ అలాగే ఉన్నాయ్. "మీ భర్త టి.వీ. చూస్తుంటే దగ్గర కూర్చుని జుట్టు చెరపండి. దిండేసి కొట్టండి" అని రాసుకొచ్చారు. ఇంట్లో బుద్ధి తెలుస్తున్న పిల్లల్ని ఎదురుగా పెట్టుకుని అలాంటి పన్లెలా చెయ్యటం? మొహమాటంగా ఉండదూ!

కాళ్ళు నొక్కండి అని రాసారు. అది కాస్త బాగానే ఉన్నట్లు అనిపించింది. రాత్రి టి.వి. చూస్తుంటే పక్కనచేరింది. ఆ కాళ్ళిటు పెట్టండి నొక్కుతా అంది. అనుమానంగా చూసాడు కిరణ్.

"ఎందుకు ఏదైనా షాపింగ్ ఉందా? ఈ నెల నా దగ్గర తంతే దమ్మిడీ లేదు" అన్నాడు.

"అయ్యో! అదేం కాదు. ఇలా భర్త కాళ్ళు నొక్కితే ప్రేమ పెరుగుతుందట. పత్రికలో రాసారు" అని చెప్పింది.

"వద్దులే ఇప్పుడున్న ప్రేమ చాలు. రేపు ఇంకెవరైనా కోపం వస్తే భర్త పీక నొక్కండి పీడా విరగడ అవుతుందని పత్రికలో రాస్తే నా పీక నొక్కేస్తావా? ఫో పోయి నీ పని చేసుకో" అని కసిరాడు. ఓర్పు నశించిపోయింది లతకి.

ఇక నావల్ల కాదు. నా మొహాన ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుంది అనుకుంది. మామూలు రొటీన్లో పడిపోయింది.

మరుసటి నెలలో పిల్లలకి సెలవులు. పుట్టింటికి ప్రయాణమైంది లత. వాళ్ళని రైలెక్కించి ఇంటికొచ్చాడు కిరణ్. ఇల్లంతా బావురుమంటోంది. సరిగ్గా అప్పుడే గోపీ ఫోన్ చేసాడు. ఈ రోజుల్లో కాస్తంత కళాపోషణ ఉండడంలో తప్పేం లేదంటాడు. లైఫ్ ఎంజాయ్ చెయ్యమని చంపుకు తింటాడు. అలా భార్యని రైలెక్కించి రాగానే ఇలా గోపీ ఫోన్ రావడం చిరాకేసింది కిరణ్‌కి.

అసలే మనశ్శాంతి లేక ఏడుస్తుంటే వీడొకడు. కళాపోషణలన్నీ సాగినంత కాలం బానే ఉంటాయి. బెడిసికొడితేనే పళ్ళు రాల్తాయి. తప్పో, ఒప్పోగానీ అదో తలనొప్పి వ్యవహారం. అందుకే అటు దృష్టి సారించలేదు కిరణ్. కానీ జీవితం నీరసంగా సాగుతోంది. ఈ మధ్య ఏ నలుగురు స్నేహితులు కలిసినా ఇదే టాపిక్.

నాకూ మా ఆవిడకీ కెమిస్ట్రీ సరిగ్గా నడవడం లేదు- అని చెప్పుకుని వాపోతున్నా రందరూ.

తనకు భార్యకీ కూడా కెమిస్ట్రీ ఏం లేదు. ఏ మాటకా మాటే చెప్పుకోవాలి లత మంచిదే. చూడ్డానికి కూడా బావుంటుంది చిలుకలా! ఏం లాభం అయోమయం మేళం. బంగాళ దుంప కూర అట్లకాడతోనూ, పెరుగు చెంచాతోనూ వడ్డిస్తుంది. తను మనసు పడి కొనుక్కున్న బాంబే డైయింగ్ తువ్వాళ్ళు బీరువాలో పెట్టి తాళం వేసి వాళ్ళ వాళ్ళు పంచెలతో పాటు పెట్టిన నేత తువ్వాళ్ళు తన మొహాన వేస్తుంది. అదేమంటే అంత ఖరీదైనవి మీకెందుకూ! ఎవరైనా అతిథులొచ్చినప్పుడు వాడచ్చు. మీకు ఈ తువ్వాళ్ళు చాలు- అని దలాయించేస్తుంది.

పొద్దునే పనిమనిషికి గిన్నెలు వేస్తూ పాలగిన్నెలో ఇంత పసుపువేసి తుడిచి మొహానికి రాసుకుంటుంది. అలా చేస్తే చర్మ సౌందర్యం ఇనుమడిస్తుందట. తెల్లారి లేచి ఆఫీసుకు వెళ్ళే దాకా పులివేషం వేసినట్లు ఉన్న మొహమే గతి.

రాత్రిపూట పక్కన చేరి పక్కంటి భానుమతిగారు అన్నం గుండిగా పులుసు కళాయి బేగం బజార్లో అమ్మేసి సీల్డు డిన్నర్ సెట్టూ, స్టీలు నీళ్ళ డ్రమ్మూ కొన్నారు. అరవిందగారి మేనల్లుడికి బైక్‌మీద వస్తుంటే అప్పా జంక్షన్ దగ్గర ఏక్సిడెంటై కాలు విరిగిందట- అని పిచ్చి కబుర్లు చెప్తుంది. అటువంటి మనిషితో ఏం కెమిస్ట్రీ నడుస్తుంది?

ఈ జీవితానికి ఇక ఇంతే అనుకున్నాడు. రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే ఉన్నారు భార్యాభర్తలు.

"నువ్వెలా ఉన్నావ్? పిల్లలెలా ఉన్నారు?" అని అతగాడు.

మీరెలా ఉన్నారూ? వేళ్టికి తింటున్నారా? అని ఆవిడా పొడిపొడిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. లత ప్రయాణం దగ్గరపడింది. అంతలో పిల్లలకి సెలవులు పొడిగించారని తెలిసింది. వాళ్ళని ఉండనీ, మేము తీసుకొచ్చి దిగబెడతాం అన్నారు అమ్మమ్మా, తాతయ్యా! ఒంటరిగానే రైలెక్కింది లత.

స్టేషనుకి వెళ్ళి భార్యని రిసీవ్ చేసుకున్నాడు కిరణ్. ఇంటికొచ్చారు. ఇంట్లో కాలు పెట్టి భర్త వంక కోపంగా చూసింది. "పుట్టింటికెళ్ళి నాల్రోజులు సుఖంగా

విశ్రాంతి తీసుకున్న ఆనందం లేకుండా చేస్తారు. లంక మేతకీ గోదావరి ఈతకీ చెల్లు అన్నట్లు ఉంటుంది. ఇల్లు చూడండి. ఎలా ఉందో" అని విసుక్కుంటూ రంగంలోకి దిగింది.

అదేం పట్టనట్లు చిద్విలాసంగా సోఫాలో కూర్చుని టి.వి. ఆన్ చేస్తాడు కిరణ్. ఫ్రెండ్స్ ఫోన్ చేసారు. "అబ్బా! మీ ఇద్దరేనా ఇంట్లో ఇకనేం?" అని ఆట పట్టించారు.

సాయంత్రం భార్యాభర్తలు ఎదురుగా కూర్చున్నారు. పదహారు సూత్రాల్లో ఏదైనా ఒకటి ప్రయోగిద్దామా అనుకుని కూడా మొహమాటం వేసి ఊరుకుంది.

నువ్వీ చీరలో చాలా అందంగా ఉన్నావ్ అని చెప్తే కెమిస్ట్రీ నడుస్తుందేమో అనుకుని కూడా ఊరుకున్నాడు కిరణ్.

ఓ అరగంట గడిచే సరికి విసుగేసింది అతనికి. పద హోటల్‌కెళ్దాం. నీకు నార్తిండియన్ ఫుడ్ ఇష్టం కదా అని బయలుదేరదీసాడు. హోటల్‌కి వెళ్ళారు. మేము నలుగురం అనబోయి నాలుక కరుచుకుని ఇద్దరం అన్నాడు. వాళ్ళు టేబుల్ చూపించారు. ఇద్దరూ కూర్చున్నారు. మెనుకార్డు అందించాడు.

అది తిరగెయ్యగానే నాకు నూడిల్స్, నాకు ఫ్రైడ్ రైస్ అని పేచీలు. ఇద్దరూ కలిసి ఒక ఐటమ్ ఆర్డర్ చెయ్యండిరా అని వీళ్ళు బతిమలాటం, కాదూ కూడదూ అని వాళ్ళ పంతం. విసుగేసి వాళ్ళకు కావలసినవే ఆర్డరు చేసి తినగా మిగిలినవి తింటూ వేస్టయిపోతాయని వీళ్ళు ఆర్డర్ చేసినవే తిని ఏడవాలి. మనకి నచ్చిన పదార్థం తెప్పించుకుని తినే అదృష్టం ఎప్పటికైనా కలుగుతుందా అని వీళ్ళు తలకాయలు పట్టుకోవటం అన్నీ గుర్తొచ్చాయి.

మెనూకార్డ్ పక్కన పడేసి మొక్కుబడిగా ఆవిడ ఓ ప్లేటు ఇడ్లీ, అతను ఉప్మా ఆర్డరిచ్చి మొక్కుబడిగా తినేసి బయట పడ్డారు.

మర్నాడు పొద్దున కాఫీ తాగుతూ "మా ఫ్రెండ్‌కి ఒక రిసార్ట్‌లో కాటేజ్ ఉంది. నన్ను వెళ్ళమని ఎప్పుడూ పోరుతూ ఉంటాడు వెళ్దామా రెండ్రోజులు?" అన్నాడు. మీ ఇష్టం అంది.

ఫోన్ చేతిలోకి తీసుకుని కూడా అక్కడ పిల్లల కోసం గేమ్స్ అవీ బోలెడుంటాయట వాళ్ళని తీసుకుని వెళ్దాం అని పక్కన పెట్టేసాడు.

టిఫిన్ తింటూ, "నాగార్జున సాగర్ వెళ్దామా?" అన్నాడు. "వెళ్ళచ్చు కానీ అక్కడ బోటింగ్ ఉంటుందిట కదా! పిల్లలుంటే సరదాపడతారు" అంది.

అదీ కాన్సిల్ అయిపోయింది.

సాయంత్రానికి మరీ దారుణంగా తయారైంది పరిస్థితి. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. మాటా, పలుకూ లేదు. అప్పటికీ మార్పుగా ఉంటుందని మాయాబజార్ సి.డీ. కూడా పెట్టాడు కిరణ్. కానీ ఏమీ ప్రయోజనం లేకపోయింది.

"నాకు ఏడుపొస్తోంది" అంది గుడ్లనీళ్ళు కుక్కుకుని. నీకంటే ఎక్కువ నాకొస్తోంది ఏడుపు అని మనసులో అనుకుని పైకి మాత్రం, "ఇప్పుడేడిచి ఏం లాభం? వాళ్ళుంచమంటే మాత్రం పిల్లల్ని వదిలేసి టింగురంగా అని వచ్చెయ్యడమేనా? నీకు లేకపోతే మీ నాన్నకుండద్దూ! ఇద్దరూ ఇద్దరే అయోమయం మేళాలు" అని కోప్పడ్డాడు.

మర్నాడు పొద్దున రైల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. వాళ్ళ మొహాలు వెలిగిపోతున్నాయి. ఊరికెళ్ళి నాల్రోజులుండి పిల్లల్ని తెచ్చేసుకుంటారు.

"ఈ రెండ్రోజులూ సుఖంగా ఉన్నాం. మళ్ళీ మొదలు వాయింపు. ఇద్దరికిద్దరూ అల్లరి వెధవలు. రావణాసురుడూ శూర్పణఖా. నీ పోలికే వచ్చింది వాళ్ళకి" అన్నాడు కిరణ్.

"ఏం కాదు... మీ పోలికే చిన్నప్పుడు పిచ్చి అల్లరి చేసేవారట కదా మీరు. మీ అల్లరి భరించలేక ఇంటి మీదికి వచ్చేవారుట అందరూ. అత్తయ్యగారు చెప్పారు" అంది లత మురిపెంగా.

అదీ అసలైన బంధం. అన్ని పందంటి సూత్రాలకీ అతీతమైన ఇండియన్ కెమిస్ట్రీ.

అచ్చ తెలుగులో చెప్పాలంటే పదహారణాల భారత రసాయన శాస్త్రం. ❑

*చిత్ర సకుటుంబ సచిత్ర మాస పత్రిక, జూన్ 2012*

కథా నిలయం
6442
శ్రీకాకుళం